క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులతో మాట్లాడుతున్న బత్తిలి ఎస్సై అప్పారావు

భామిని: ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బత్తిలి ఎస్సై జి. అప్పారావు సూచించారు. మండలంలోని కాట్రగడ వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం..

- మాజీ ఎమ్మెల్యే కళావతి



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: మండలంలోని నులకజోడుకు చెందిన కొన్న సంతోష్‌కుమార్ (39) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడు మురపాక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆమె వెంట సర్పంచ్ కొత్తూరు ప్రసాద్, ఉప సర్పంచ్ కొన్న తిరుమల, సంజీవ్, సాసుపిల్లి విశ్వనాథం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, పతివాడ పగడాలమ్మ, వలరౌతు ఫాల్గుణరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు సూరంపేట పంచాయితీ గ్రామాల్లో జరుగుతున్న పూడిక తీత కార్యక్రమంతో పాటు పారిశుధ్య పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు జరుగుతున్నాయని ఈ పనులు పూర్తి చేయాలని, బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికి ఇంటి ఇళ్లలో నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవాలన్నారు. తద్వారా వ్యాధుల నివారణకు సహకరించాలని కోరారు. ఇప్పటికీ బహిరంగ మల విసర్జన జరుగుతున్న గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పనసలపాడులో వేంకటేశ్వర వ్రతాలు



పనసలపాడులో నిర్వహిస్తున్న సామూహిక వేంకటేశ్వర వ్రతాలు

సాలూరు: పాచిపెంట మండలంలోని పి.కోనవలస పంచాయతీ పనసలపాడు గిరిజన గ్రామంలో ఆదివారం సామూహిక వేంకటేశ్వర వ్రతాలు నిర్వహించారు. సనాతన ధర్మపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి మహత్యాన్ని వివరిస్తూ, వ్రతం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని పూజించారు.

హోటల్‌లో మర్చిపోయిన బ్యాగు మాయం

పార్వతీపురం రూరల్: రాయగడకు చెందిన సైలాడ వరలక్ష్మి కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం పార్వతీపురం లోని బైపాస్ రోడ్‌లో ఉన్న హోటల్‌లో టిఫిన్ నిమిత్తం వెళ్లి, తిరిగి వెళ్లే క్రమంలో తమ బ్యాగును హోటల్‌లోనే మర్చిపోయారు. కొంత ప్రయాణం అనంతరం తిరిగి హోటల్‌కు వెళ్లి చూడగా బ్యాగు అపహరణకు గురవడంతో పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. అపహరణకు గురైన బ్యాగులో రూ.95 వేల నగదు ఉన్నట్లు బాధితులు వెల్లడించినట్లు ఎస్సై చెప్పారు.

మాస్టారు కుటుంబాన్ని పరామర్శించిన డీవీజీ

సాలూరు రూరల్: ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయుడు కోట బాలకృష్ణ కుటుంబసభ్యుల ను ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఆదివారం పరామర్శించారు. మండలంలోని పెదపథం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కోట బాలకృష్ణ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ డీవీజీ శంకర్రావు ఆదివారం ఆయన స్వగ్రామం పాలికవలస వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.





అప్పుడు వంతెన.. ఇప్పుడు రోడ్డు.. వారే సొంతంగా నిర్మించుకున్నారు!

ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని వారెదురు చూడలేదు. మొదట తమ కష్టాలను ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పుకున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో వారే ముందడుగు వేసి, స్వయంగా వంతెన..రోడ్డు.. నిర్మించుకున్నారు. ఇదంతా ఎవరి కథ అనుకున్నారా..కురుపాం మండలం, గొటివాడ పంచాయతీ, బోరి గ్రామస్తులది. గొటివాడ నుంచి బోరి గ్రామం మధ్య సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో పాటు ఆయా ప్రాంతాల మధ్య ఉండే గెడ్డపై కూడా వంతెన సౌకర్యం లేదు. దీంతో గ్రామస్తులు వారి గ్రామం నుంచి వేరే ప్రాంతానికి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఎంతోమంది నాయకులు, అధికారులను కలిసి తమ గోడు వినిపించారు. అయినా ఫలితం లేకపోవడంతో గ్రామ ప్రజలంతా కలిసి ఏడాది క్రితం గెడ్డపై కర్రల సాయంతో తాత్కాలికంగా వంతెన ఏర్పాటు చేసుకున్నారు.

ఇప్పుడు చందాలు వేసుకుని మరీ ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు వీలుగా సీసీ రోడ్డు నిర్మించుకున్నారు. ఏ చిన్నపాటి వర్షం కురిసిన వరదనీటితో గెడ్డ పొంగేదని, రోడ్డు కూడా బురదమయమై రాకపోకలకు ఇబ్బంది అయ్యేదని తెలిపారు. ప్రస్తుతం వానాకాలంలోనూ రాకపోకలకు అంతరాయం కలగకుండా తాత్కాలిక వంతెన, రోడ్డుల నిర్మాణం చేసుకున్న ఆ గ్రామస్తులను చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు.

–గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

చంద్రబాబు పాలనలో రాష్ట్రం అధోగతి

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి



కూటమి మోసాలను వివరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: చంద్రబాబు పాలనలో రాష్ట్రం అధోగతి పాలవుతోందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి విమర్శించారు. మండల కేంద్రంలో పార్టీ మండల కన్వీనర్ కోట రమేష్ నాయుడు, నాయకుడు ఆర్నపల్లి వెంకటనాయుడుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొని, ప్రజలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. అలాగే అప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను తెలియజేశారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని, లేనిపోని హామీలిచ్చి ప్రజలతో ఓటు వేయించుకున్న కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక వారిచ్చిన హామీల అమలు విస్మరించారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీల్లో గ్యాస్, తల్లికి వందనం పథకాలు అరకొరగా అమలు చేసి, అన్ని హామీలు అమలు చేసేసినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ వంటి హామీలు ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు.



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న పుష్పశ్రీవాణి, నాయకులు

–ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం..

ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ కూటమి నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని, ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం సాగిస్తూనే ఉంటుందన్నారు. ప్రజలు కూడా కూటమి మోసాలపై నిలదీయాలన్నారు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు ఆడబిడ్డ నిధిపై చేసిన వ్యాఖ్యలు(ఆడబిడ్డ నిధి పథకం ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలి) చూస్తే ప్రభుత్వం పథకాలు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందన్న విషయం తేటతెల్లమవుతోందన్నారు. ఓట్లు కోసం జనాన్ని మోసం చేస్తూ అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చినప్పుడు తెలీదా అని ప్రశ్నించారు. ఎన్నికల హామీలు తప్పకుండా అమలు చేయాలని ప్రజలను మోసం చేయాలని చూస్తే వారే తగిన బుద్ధి చెబుతారని హితవుపలికారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈదల రాములు, ఎంపీటీసీ శంకరరావు, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, లోలుగు నారాయణరావు, బలగ వెంకటరమణ, గంట జగన్నాథంనాయుడు, అనంతనాయుడు, రాయగడ శేఖర్, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలను వివరించండి

- మాజీ ఎమ్మెల్యే కళావతి



బాబు మోసపూరిత హామీలపై అవగాహన కల్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: సూపర్ సిక్స్ పేరిట తప్పుడు హామీలిచ్చి ప్రజలను మోసగించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీరును ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే మాజీ విశ్వాసరాయి కళావతి అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తోట సింహాచలం, మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని ఘనసరలో ఆదివారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళావతి, తదితరులు ఇంటింటికీ వెళ్లి బాబు హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ వివరించారు. భర్తలు చనిపోయిన మహిళలు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతోమంది పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ఊసెత్తడం లేదని మండిపడ్డారు. గ్రామాల్లోకి కూటమి నాయకులు వస్తే హామీలు ఎందుకు అమలు చేయలేదని నిలదీయాలన్నారు. ఈ సందర్భంగా బాబు రీకాలింగ్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఎం.మోహన్‌బాబు, సర్పంచ్ తొగరాన శ్రీను, పార్టీ నాయకులు రాంప్రసాద్ పాత్రో, గెల్లంకి రమేష్, పిన్నింటి హరిబాబు, వలరౌతు వెంకటరమణ, రొక్కం రమేష్, పోతల మజ్జి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- జీసీడీఓ రాములమ్మ



మాట్లాడుతున్న జీసీడీఓ రాములమ్మ

భామిని: బాలికలు ఆత్మస్థైర్యంతో చక్కగా చదువుకుంటూ ముందుకు సాగాలని జిల్లా జీసీడీఓ రాములమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని సింగిడిలో హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కె. ప్రభుదాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రో క్లబ్' బాలికల చైతన్య కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. సమాజంలోని లింగ వివక్షతను పట్టించుకోకుండా నిర్భయంగా ఉండాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం గ్రో క్లబ్ సభ్యులకు శానిటరీ ప్యాడ్స్ అందించి వాటి ప్రయోజనాలు, వ్యక్తిగత పరిశుభ్రతను వివరించారు. అనంతరం జీసీడీఓను హోలీక్రాస్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీవిద్య, మెంటార్స్, బాలికలు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి అధికారులను నియమించాలి

సీతంపేట: గిరిజన సంక్షేమ విధానాలు, పథకాలు అమలు జరిగి గిరిజనుల అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఐటీడీఏలకు పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిడ్డిక తేజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాహుల్‌కుమార్ రెడ్డి బదిలీ తర్వాత సీతంపేట ఐటీడీఏకు ఇంతవరకు రెగ్యులర్ పీఓను నియమించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఐటీడీఏకు రెగ్యులర్ పీఓలను నియమించాలని కోరారు.

పర్యవేక్షణ అవసరం

పాలకొండ రూరల్: పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపై దృష్టి సారించాలని ఎస్సై ప్రయోగమూర్తి సిబ్బందికి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. దాదాపు 80 కూడళ్ల వద్ద ఈ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పట్టణ పరిధిలో పర్యవేక్షణ సులభతరమైందన్నారు. పట్టణ ప్రధాన మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును ఆయన పరిశీలించారు.

కోటదుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పాలకొండ రూరల్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ప్రధానార్చకులు లక్ష్మీప్రసాద్‌శర్మ, మణిల్‌కుమార్ శర్మ భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు. స్థానిక అభయాంజనేయ ఆలయంలో అన్నదానం చేపట్టారు.

కూటమి పాలన అంతా మోసమే..

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్ సీపీ నాయకులు

జియ్యమ్మవలస రూరల్: కూటమి పాలన అంతా మోసమేనని, అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి హామీలు అమలు చేయకుండా ప్రజలను ఏ విధంగా అమలు చేస్తున్నారో రాష్ట్రం మొత్తం చూస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని డంగబద్ర, గడసింగిపురం పంచాయతీల్లో ఆదివారం పర్యటించిన ఆయన కూటమి మోసాలను గ్రామస్తులకు వివరించారు. అలాగే గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు, ఇప్పటి కూటమి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను తెలిపారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలు అందిస్తూ మేలు చేశారన్నారు. ఇప్పటి చంద్రబాబు ప్రభుత్వమే పథకాలైనా, రుణాలైనా, వ్యవసాయ యంత్రాలైనా, అభివృద్ధి పనుల కాంట్రాక్టులైనా వారి పార్టీ వారికే ఇస్తూ వారి కడుపునింపడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల హామీలు అమలు చేయలేదని, అరకొరగా అరకొరగా ఒకట్రెండు పథకాలు ఇచ్చి, అన్ని హామీలు అమలు చేసేసినట్లు గొప్పలు చెబుతుండడం సిగ్గుచేటన్నారు. పథకాలు వైపు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రకరకాల వేషాలు వేస్తున్నారని, అవన్నీ ప్రజలు గమనిస్తున్నారని ధ్వజమెత్తారు. ఏ గ్రామానికి వెళ్లినా వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయన్నారు.

అభివృద్ధి శూన్యం..

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలు గానీ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి గానీ శూన్యమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు ఎన్నికప్పుడు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకోవాలని, వారికి అన్యాయం చేస్తే ఊరుకోబోమని, ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు లోలుగు నారాయణరావు, ఆర్టీఐ నియోజకవర్గ చైర్మన్ రాయగడ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



జియ్యమ్మవలస రూరల్: గడసింగిపురంలో ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు

మోసం చంద్రబాబుకు అలవాటు..

గరుగుబిల్లి: మోసం చేయడం చంద్రబాబు నైజమని రాజకీయ తొలినాళ్ల నుంచి అది ఆయనకు అలవాటుగా మారిపోయిందని జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావివలస గ్రామంలో శనివారం రాత్రి పర్యటించిన ఆయన..కూటమి మోసాలను వివరించారు. ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి, తీరా అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకుండా చేతులెత్తేయడం తగదన్నారు. ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు పథకాలు రావడం లేదని బాధపడుతున్నారని, గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా ఇచ్చిన పథకాలను గుర్తు చేసుకుంటున్నారన్నారు. పథకాలు అమలు చేయాలని ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని వారి దృష్టి మళ్లించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు, అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదు..సంక్షేమమూ లేదన్నారు. అలాగే మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని, ఎక్కడైనా ఎవరికైనా అన్యాయం జరిగితే ప్రశ్నిస్తానన్న పవన్..రాష్ట్రం నిత్యం దాడులతో అట్టుడికిపోతుంటే ఏం చేస్తున్నారు, ఎక్కడున్నారని నిలదీశారు. అధికారం కోసమే మాయమాటలు చెప్పి ఇప్పుడు తప్పించుకు తిరుగుతున్న మిమ్మల్ని ప్రజలు మరోసారి నమ్మే పరిస్థితులు లేవన్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని అంతవరకు వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్స అప్పడు, వైస్ సర్పంచ్ గుంట్రెడ్డి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: రావివలసలో ప్రచారం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు

పరామర్శ

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని బిత్రపాడు గ్రామంలో సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు తండ్రి గుంట్రెడ్డి కృష్ణంనాయుడు ఇటీవల మరణించడంతో ఆ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఆదివారం కలిసి పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొయిపాక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సామల మాధవరావును మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఆదివారం పరామర్శించారు. మాధవరావు తల్లి విమలమ్మ ఇటీవల మృతి చెందగా, ఆమె మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆమె వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి నిమ్మక గోపాల్ తదితరులు ఉన్నారు.



గుమ్మలక్ష్మీపురం: మాధవరావును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

క్రికెట్ టోర్నీ విజేత 'కొండవాడ'

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కె.శివడ గ్రామంలో ఆదివారం జరిగిన క్రికెట్ టోర్నీ ఆఖరి పోరులో కొండవాడ(గుమ్మలక్ష్మీపురం మండలం) గ్రామ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. బారామణి(కురుపాం మండలం) గ్రామ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కొండవాడ జట్టు నిర్దేశిత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. అనంతరం 91 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన బారామణి జట్టు 33 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. ఆ తర్వాత జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా ఎల్విన్‌పేట సీఐ బి.హరి హాజరై విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ హరి

పడిపోయిన కొండచీపుర్ల ధర



కొండాడలో ఆరబెట్టిన కొండచీపుర్లు

సీతంపేట: ఏజెన్సీలో విస్తారంగా లభించే కొండచీపుర్ల ధర ఉన్నట్టుండి ఒక్కసారిగా పడిపోయాయి. కొండల్లో లభించే పుల్లలను గిరిజనులు సేకరించి, ఇంటి వద్ద చీపుర్లుగా తయారు చేస్తుంటారు. కొద్ది రోజుల కిందట వరకు క్వాలిటీని బట్టి ఒక్కో చీపురు రూ. 50 నుంచి 60 రూపాయల వరకు విక్రయించేవారు. ప్రస్తుతం ఈ చీపుర్ల ధర రూ. 25 నుంచి 35 రూపాయల మధ్య పలుకుతోంది. దీంతో కష్టానికి గిట్టుబాటు కావడం లేదని గిరిజనులు వాపోతున్నారు.

మూడు నెలలకే రహదారులు ఛిద్రం..

- పనుల్లో లోపించిన నాణ్యతా ప్రమాణాలు



సీఎస్పీ రోడ్డులో వండువ దాటిన తర్వాత ఛిద్రమవుతున్న రోడ్డు

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లె పండగలో భాగంగా వేస్తున్న రహదారుల్లో నాణ్యతా ప్రమాణాలు వెక్కిరిస్తున్నాయి. రోడ్లు వేసిన మూడు నెలలకే తారు ఊడిపోతుండడంతో ఛిద్రమవుతున్నాయి. ఇటీవల సీఎస్పీ రోడ్డు నుంచి చిదిమి గ్రామం వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర వరకు వేసిన రహదారిలో పలు చోట్ల తారు ఊడిపోతోంది. అలాగే వండువ జంక్షన్ నుంచి నవగాం వరకు వేసిన బీటీ రహదారిలో వండువ దాటిన తర్వాత రహదారి పెచ్చులూడి డొల్లతనం బయటపడుతోంది. వాస్తవానికి రోడ్డు వేసేటప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు వారి ఇష్టం వచ్చినట్లు పనులు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.కోట్లు ఖర్చు చేసి వేస్తున్న రహదారులు కాంట్రాక్టర్లను పెంచేందుకే తప్ప ప్రజలకు ఉపయోగం లేదని పలువురు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఛిద్రమతున్న ఈ రోడ్లు బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



చిదిమి రోడ్డులో ఊడిపోతున్న తారు